సాక్షి
ఖమ్మం
గురువారం । 24 । అక్టోబర్ । 2024



ఇలా కట్టడి చేద్దాం..

హింసాత్మక ఘటనలు, భారీ ర్యాలీలు జరిగితే కట్టడి చేసే విధానంపై పోలీసు సిబ్బందికి మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. 8లో



చోరీ కేసుల్లో ముఠా అరెస్ట్

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురి ముఠాను అరెస్ట్ చేయగా కల్లూరు ఏసీపీ రఘు వివరాలు వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఏఎన్‌ఎం శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో ఏఎన్‌ఎం శిక్షణకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. ఇంటర్‌లో ఏ గ్రూప్ అయినా పూర్తి చేసి, 17ఏళ్లు నిండిన ఉమ్మడి జిల్లాలోని మహిళలు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సెస్సీ మెమో, 4నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధృవీకరణ పత్రం, రెండు ఫొటోలతో పాటు 'కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్' పేరిట తీసిన రూ.200 డీడీతో మహిళా ప్రాంగణానికి వస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

ముగిసిన ఫార్మా కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగి

ఖమ్మం సహకారనగర్: టీజీ ఎప్‌సెట్ అర్హత సాధించిన వారికి బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్ బుధవారం ముగిసింది. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్లు పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. చివరిరోజు స్లాట్ బుక్ చేసుకున్న 197మందికి 185మంది హాజరయ్యారని వెల్లడించారు.

పాఠశాలల పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మం సహకారనగర్: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ 955 పాఠశాలలకు గాను 147 పాఠశాలల్లో మిగిలిన పనులు పూర్తిచేయాలని సూచించారు. డీఎంఎఫ్‌టీ నిధులు అందుబాటులో ఉన్నందున పనుల పురోగతి ప్రకారం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. ముందస్తుగా రూ.16.18 కోట్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. అలాగే, ఎంపీడీఓలకు కేటాయించని రూ.12.28 కోట్ల నిధుల్లో రూ.6.49 కోట్ల మేర బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ఈసమావేశంలో డీఈఓ సోమశేఖర శర్మ, సీపీఓ ఏ.శ్రీనివాస్, విద్యాశాఖ ప్రాజెక్ట్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో తెరుచుకున్న క్యాంటీన్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యాంటీన్ తెరుచుకుంది. ఈ క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు ఇందిరా మహిళ శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు కేటాయించగా బుధవారం ప్రారంభించారు. 'నిధుల్లేక సుస్తీ!' శీర్షికన ఆస్పత్రిలో ఆదాయ మార్గాలు ఉన్నా వినియోగించుకోవడం లేదని ఈనెల 21న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. క్యాంటీన్ ద్వారా నెలనెలా రూ.4.2 లక్షల ఆదాయం వస్తుండగా నాలుగు నెలలుగా మూసివేశారు. దీంతో నిధుల కొరత ఏర్పడిన అంశంపై కథనం రావడంతో సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు నివేదించారు. ఈమేరకు మంజునాథ్ గ్రూపునకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడంతో బుధవారం క్యాంటీన్ తెరుచుకుంది.

లెక్క లేకుండానే లెవల్..

జిల్లాలో జాతీయ రహదారులపై నిర్మిస్తున్న వంతెనలు వరదలను తట్టుకుని నిలబడతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతనెలలో వచ్చిన వరదకు పాలేరు ఏటి వంతెన పైనుంచి నాలుగు అడుగుల మేర వరద ప్రవహించింది. దీంతో ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారి మధ్య రాకపోకలు నిలిపేయగా, వంతెన సమీపాన రోడ్డు కోతకు గురైంది. అధికారులు మాత్రం అనుకోని రీతిలో వచ్చిన వరదతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని దాటేశారు. ఈక్రమంలోనే జిల్లాలో హైవేలపై కొత్తగా నిర్మిస్తున్న మరికొన్ని వంతెనల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

వరద తాకిడికి కూసుమంచి మండలం హట్యాతండా వద్ద హైవేపై దెబ్బతిన్న బ్రిడ్జి



లో లెవల్‌లో ఎన్‌హెచ్ వంతెనల నిర్మాణం

- ఇటీవల వరదకు పాలేరు ఏటి వంతెన పైనుంచి ప్రవాహం
- అయినా ధంసలాపురం వద్ద బ్రిడ్జి పాత ప్రతిపాదనలకే ఓకే..
- భవిష్యత్‌లో మున్నేటికి భారీ వరద వస్తే ఏమిటన్నది ప్రశ్నార్థకం

ఖమ్మంను ముంచెత్తిన వరద..

గత 1వ తేదీన జిల్లాలో కురిసిన భారీ వర్షానికి తోడు వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలతో ఆకేరు, మున్నేరుకు వరద చేరింది. దీంతో మున్నేరు పరీవాహకం జలదిగ్బంధంలో చిక్కుకుని కొన్ని ప్రాంతాల్లో బ్రిడ్జిల పైకి వరద చేరగా, ఇంకొన్ని చోట్ల బ్రిడ్జిల సమీపం నుంచి ప్రవహించింది. తిరుమలాయపాలెం మండలం రావిచెట్టుతండా వద్ద 200 మీటర్ల పొడవైన వంతెన కొట్టుకుపోయింది. అలాగే, ఖమ్మం ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పైనుంచి వరద వెళ్లడంతో ఎస్–12 స్పాన్ పక్కకు జరిగింది. పాలేరు ఏటి వంతెన పైనుంచి సైతం వరద ప్రవహించగా, చాలాచోట్ల వంతెనలు దెబ్బతిన్నాయి.

పైనుంచి నాలుగు అడుగులు

ఖమ్మం– సూర్యాపేట జాతీయ రహదారి(ఎన్‌హెచ్ – 365 బీబీ)పై కూసుమంచి మండలం హట్యాతండా వద్ద నిర్మించిన వంతెన గత నెలలో వచ్చిన వరదను తట్టుకోలేకపోయింది. అధికారులు పాలేరుకు లక్ష క్యూసెక్కుల లోపు వరద వస్తుందనే అంచనాతో 12 అడుగుల ఎత్తులో బ్రిడ్జి నిర్మించారు. కానీ 1.70 లక్షల క్యూసెక్కుల వరదతో 16 అడుగుల మేర ప్రవహించగా బ్రిడ్జి పై నాలుగు అడుగుల మేరకు నీరు చేరింది. దీంతో రోడ్డు కూడా కోతకు గురైంది.

భవిష్యత్‌లో భయమే..

ఇంజనీరింగ్ అధికారులు ప్రస్తుత పరిస్థితులతో పాటు భవిష్యత్‌ను అంచనా వేసి నిర్మాణాల ప్రతిపాదనలు రూపొందిస్తారు. కానీ ఖమ్మం–హైదరాబాద్ జాతీయ రహదారి సమీపాన ఉన్న పాలేరుకు లక్ష క్యూసెక్కులకు మించి వరద రాలేదనే కారణంతో 12 అడుగులతో వంతెన నిర్మించారు. కానీ అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. ఇక ఖమ్మం–దేవరపల్లి నేషనల్ హైవేపై ధంసలాపురం వద్ద వంతెన 42 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నారు. ఈ బ్రిడ్జి పిల్లర్ల స్థాయిలోనే ఉన్నప్పటికీ గతనెలలో వచ్చిన వరదతో పిల్లర్ల సమీపానికి వరద చేరింది. అయినా అధికారులు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటామే తప్ప ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో పెట్టుకోలేమని చెబుతుండడం గమనార్హం.



ధంసలాపురం సమీపాన బ్రిడ్జి పిల్లర్ల పైనుంచి వరద వెళ్లడంతో ఆగిన చెత్త

అదే ఎత్తు చాలు..

ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారి(ఎన్‌హెచ్–365 బీజీ) నిర్మాణంలో భాగంగా ధంసలాపురం వద్ద మున్నేరుపై 42 అడుగులు ఎత్తుతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. అయితే మున్నేరుకు గతనెలలో దాదాపు 41 అడుగుల మేరకు వరద వచ్చింది. ఈ వరదలు వచ్చాక అధికారులు బ్రిడ్జి డిజైన్‌ను పరిశీలించారు. ఖమ్మం నగరం, రూరల్ ప్రాంతాల్లో మున్నేరు ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు ఉండడంతో అంత వరద వచ్చిందని.. ఫలితంగా ధంసలాపురం సమీపాన బ్రిడ్జి ఎత్తు పెంచాల్సిన అవసరం లేదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే 42అడుగుల ఎత్తుతో బ్రిడ్జి నిర్మిస్తున్నా భవిష్యత్‌లో అంతకు మించి వరద వస్తే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వరద పరిస్థితులను బేరీజు వేశాం...

ఖమ్మం–దేవరపల్లి హైవేలో భాగంగా ధంసలాపురం వద్ద వంతెనను వరదను తట్టుకునేలా నిర్మిస్తున్నాం. గతనెల మున్నేటికి వరద సమయాన వంతెన ఎత్తుపై పునఃసమీక్షించాం. ప్రస్తుతం ఉన్న ఎత్తు సరిపోతుందని నిర్ణయానికి వచ్చాం. ఇక కూసుమంచి మండలం హట్యాతండా వద్ద వంతెనను పాలేరు గేట్లు ఎత్తితే వచ్చే వరదను అంచనా వేసి నిర్మించాం. అనుకోని స్థాయిలో వరద రావడంతో ఆ వంతెన పైనుంచి నీరు ప్రవహించింది.

– దివ్య, పీడీ, జాతీయ రహదారుల శాఖ

మిర్చి రైతులపై ధరాఘాతం

- నాణ్యత పేరిట తగ్గిస్తున్న వ్యాపారులు
- విదేశీ ఆర్డర్లు లేవంటూ సాకులు
- ఫలితంగా కోల్డ్ స్టోరేజీల్లో తరగని నిల్వలు
- సీజన్‌తో పోలిస్తే ధర తగ్గడంతో నష్టపోతున్న రైతులు



మధిర మార్కెట్‌లో మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

మధిర: ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది పంట చేతికొచ్చిన సమయాన తేజ రకం క్వింటాకు రూ.22వేల ధర పలికింది. అయితే, ధర మరింత పెరుగుతుందనే భావనతో పలువురు కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశారు. జిల్లాలోని 43 కోల్డ్ స్టోరేజీల్లో సుమారు 42 లక్షల మిర్చి బస్తాలు నిల్వ చేసే అవకాశముండగా.. అన్నీ దాదాపు నిండాయి. అయితే, ప్రస్తుతం అన్ సీజన్ అయినప్పటికీ మెరుగైన ధర దక్కకపోగా నానాటికీ తగ్గుతుండడంతో రైతులు అమ్మకానికి వెనుకంజ వేస్తున్నారు. ఫలితంగా కోల్డ్ స్టోరేజీల్లో 80శాతం మేర సరుకు అలాగే ఉందని అంచనా.

క్వింటాకు రూ.17వేలు

మిర్చి పంటకు ప్రస్తుతం అన్ సీజన్. ఇప్పుడు ధర పెరగాల్సి ఉండగా కనీసం కల్లాల్లో ఉన్నప్పటి రేటు కూడా లేదు. ఈనెల 17న తేజ రకం మిర్చి క్వింటాకు రూ.18,500 ధర పలకగా ప్రస్తుతం రూ.17 వేలు మించడం లేదు. లావు రకం మిర్చికి రూ.12వేలే ధర పలుకుతున్నా ఈ రకం మిర్చి కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని కొన్ని జిల్లాల్లో సాగు చేసే మిర్చిని ఇక్కడి వ్యాపారులు చైనా, బంగ్లాదేశ్, మలేషియా, శ్రీలంక, థాయిలాండ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌కు మాత్రమే ఎగుమతి అవుతుండడం.. మిగిలిన దేశాల నుంచి ఆర్డర్లు లేక వ్యాపారులు ముందుకు రావడం లేదు. అంతేకాక కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన మిర్చి ధర తగ్గిందని చెబుతూ మరింత ధర తగ్గిస్తున్నారు. ఇక తేజ రకం పోలిన మిర్చిని మహారాష్ట్ర, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో కూడా పండిస్తుండడంతో డిమాండ్ తగ్గుతోందని తెలిసింది. ఇదిలా ఉండగా వచ్చేనెల నుంచి ఏపీలోని కర్నూలు, తెలంగాణలోని గద్వాల జిల్లాల్లో మిర్చి చేతికొచ్చే అవకాశం ఉంది. అప్పుడు కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన మిర్చికి మరింత ధర తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధర ఖరారు.. ఆపై బేరం

మిర్చి అమ్మకానికి సిద్ధమయ్యే రైతు కోల్డ్ స్టోరేజ్ నుంచి ఒక బస్తా వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొస్తారు. అక్కడ పరిశీలించిన వ్యాపారులు ధర నిర్ధారించడం ఆనవాయితీ. ఇంతవరకు బాగానే ఉన్నా మిగిలిన బస్తాలను కాంటా వేసేందుకు కోల్డ్ స్టోరేజ్‌కు వెళ్లిన సమయాన మిర్చి నాణ్యత లేదని వ్యాపారులు, వారి ప్రతినిధులు పేచీ పెడుతూ మరింత ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ముందు నిర్ణయించిన ధరతో పోలిస్తే ఆతర్వాత క్వింటాకు రూ.200 నుంచి రూ.500 వరకు తగ్గిస్తున్నారని.. అయినా పెట్టుబడికి నగదు లేక ఏం చేయలేకపోతున్నామని చెబుతున్నారు. ఏదిఏమైనా ఓ పక్క ధర లేక రైతులు ఆందోళన చెందుతుండగా.. డిమాండ్ లేదనే సాకుతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధర తగ్గిస్తుండడతో మరింత నష్టపోవాల్సి వస్తోంది.

కోలుకోలేని నష్టం..



గత ఏడాది సాగు చేసిన తేజ రకం మిర్చి క్వింటా రూ.20వేలకు అడిగితే ధర పెరుగుతుందని నిల్వ చేశా. ఇప్పుడు అమ్ముదామని యార్డుకు తీసుకొస్తే రూ.15,500లే చెప్పారు. ఫలితంగా క్వింటాకు రూ.5వేల మేర నష్టపోయా.

– ఎస్ జమలయ్య, రైతు, సూరవరం

నాణ్యత లేదంటున్నారు ..



కల్లంలో క్వింటా రూ.19 వేలకు అడిగారు. ఇప్పుడు నాణ్యత తగ్గిందని రూ.16 వేలే చెబుతున్నారు. ధర తగ్గడమేకాక రవాణా ఖర్చులు, కోల్డ్ స్టోరేజీ అద్దె, అప్పుకు వడ్డీ అన్నీ లెక్కేస్తే క్వింటాకు రూ.6వేల వరకు నష్టపోయినట్లే.

– అల్లాడి కృష్ణ, రైతు, యన్నవెల్లి

ఎగుమతులు లేవు



విదేశాలకు ఎగుమతి ఆర్డర్లు లేకపోవడంతో మిర్చి కొనుగోళ్లు తగ్గించాం. గత ఏడాది మిర్చి బాగా పండింది. మన జిల్లాలోనే కాక ఇతర ప్రాంతాల్లోనూ మిర్చి బాగా పండిస్తున్నారు. సరుకు ఎక్కువగా రావడంతో డిమాండ్ తగ్గింది.

– తల్లపురెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వ్యాపారి, మధిర

80శాతం సరుకు అలాగే...



గత ఏడాది మిర్చి దిగుబడి బాగుండడంతో కోల్డ్ స్టోరేజీలు నిండిపోయాయి. ఇంకా 80 శాతం నిల్వలు ఉన్నాయి. నెల తర్వాత కొత్త మిర్చి చేతికొచ్చే అవకాశం ఉంది. అప్పుడు ధర ఇంకా తగ్గుతుందని రైతులు భయపడుతున్నారు.

– చుంచు రవిశంకర్ ప్రసాద్, కోల్డ్ స్టోరేజ్, మధిర

డీసీసీబీలో మరో అవినీతి పర్వం

- ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లో బయటపడిన వ్యవహారం
- నకిలీ ధ్రువపత్రాలతో 16 యూనిట్లకు రుణాలు
- అసలు, వడ్డీ కలిపి రూ.3 కోట్ల మేర అక్రమాలు



డీసీసీబీ ఖమ్మం రూరల్ బ్రాంచ్ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో మరో అవినీతి వ్యవహారం వెలుగు చూసింది. బ్యాంకు ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లో రూ.కోట్లలో అవినీతి జరిగినట్లు బయటపడింది. గతంలో వివిధ బ్రాంచ్‌ల ద్వారా నకిలీ ధ్రువపత్రాలతో 21 మందికి రూ.6 కోట్ల మేర మార్టిగేజ్ రుణాలు ఇచ్చిన వ్యవహారం 2022లో బయటపడిన విషయం విదితమే. అయితే, విచారణ చేపట్టినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. ఇంతలోనే ఖమ్మం రూరల్ శాఖ మేనేజర్ బదిలీ కావడం.. కొత్త మేనేజర్ వచ్చి రికార్డులు పరిశీలించడంతో అక్రమం బయటపడింది.

రూ.1.60కోట్ల మేర రుణాలు..

నాబార్డ్ సంస్థ 2019లో సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. ఈమేరకు డీసీసీబీ ఖమ్మం రూరల్ బ్రాంచ్ ద్వారా 16 మందికి నకిలీ ధ్రువపత్రాలతో గొర్రెలు, గేదెలు, మేకలు, పౌల్ట్రీ తదితర యూనిట్లకు రుణాలు జారీ చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ. 10 లక్షల మేర సుమారు రూ.1.60 కోట్ల వరకు రుణాలు ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఇది వడ్డీతో కలిపి రూ.3 కోట్లకు చేరాయి. గతంలో ఇక్కడ ఉన్న మేనేజర్ బదిలీ కాగా, ఆ స్థానంలో కొత్త మేనేజర్ రావడంతో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం బయటపడింది. రుణం వసూళ్లకు మార్టిగేజ్ చేసిన భూములను వేలం వేయాలని భావిస్తుండగా సదరు భూములు ఇతరుల పేరిట ఉన్నాయని గుర్తించారు.

డీజీఎంతో విచారణ పూర్తి

ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లో అక్రమాలు బయటపడడంతో విచారణ అధికారిగా డీజీఎం సర్వేశ్వరరావును సీఈఓ వసంతరావు నియమించారు. ఇటీవలే విచారణ పూర్తి చేసిన ఆయన నివేదిక సమర్పించారు. అనంతరం సీఈఓ రాష్ట్ర సహకార శాఖ రిజిస్ట్రార్(ఆర్సీఎస్)కు నివేదించడంతో అక్కడి నుంచి విచారణ జరిపించే అవకాశముంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 100 పీఏఎస్‌లు, 50 బ్రాంచ్‌లతో విస్తరించి రూ.3 వేల కోట్లకు పైగా లావాదేవీలతో కొనసాగుతున్న డీసీసీబీలో తరచుగా అక్రమాలు బయటపడుతుండడంతో ఖాతాదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై సీఈఓ వసంతరావును వివరణ కోరగా ఖమ్మం రూరల్ బ్రాంచిలో అవినీతి వ్యవహారంపై విచారణ జరిపించడమే కాక రాష్ట్ర సహకార శాఖకు నివేదించామని తెలిపారు.

కమనీయం.. నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అందరినీ ఆకట్టుకునేలా అర్బన్ పార్క్

- వెలుగుమట్ల పార్క్‌లో మరిన్ని వసతులు
- పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌కు సందర్శకుల సంఖ్య పెరిగేలా మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఎఫ్‌ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిపి పార్క్‌ను బుధవారం పరిశీలించిన ఆయన జీపులో 4 కి.మీ. మొత్తం కలియతిరిగారు. రోజువారీగా, వారంతాల్లో సందర్శకుల సంఖ్య, నిర్వహణ వ్యయంపై ఆరా తీసిన ఆయన సైక్లింగ్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే సందర్శకులను ఆకట్టుకోవచ్చని తెలిపారు. అంతేకాక ప్రధాన రహదారి పైనుంచి పార్క్ వరకు మినీ బస్సు నడిపేలా ప్రతిపాదించాలని సూచించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎఫ్‌డీఓ వి.మంజుల, ఎఫ్‌ఆర్‌ఓలు జి.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్క్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

క్రెష్‌లో అన్ని వసతులు

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటుచేసిన క్రెష్‌లో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం ఆయన క్రెష్‌తో పాటు ఫీడింగ్ రూం, భోజనశాలను పరిశీలించారు. క్రెష్ సెంటర్‌లో పిల్లలకు ఆట వస్తువులు, ఇతర సామగ్రి సమకూర్చాలన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఉద్యోగిని కుమార్తె రిషితను ఎత్తుకుని మాట్లాడారు. ఇక ఫీడింగ్ రూమ్‌కు వచ్చే మహిళా ఉద్యోగులకు యాక్సెస్ కార్డులు జారీచేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీజ, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఉద్యోగులు మహేష్‌బాబు, చిరంజీవి, రాణి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని క్రెష్‌లో చిన్నారిని ఎత్తుకున్న కలెక్టర్

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు

సమగ్ర కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సూచించారు. హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా సమీక్షించిన ఆయన ప్రజాభిప్రాయ సేకరణ, సర్వే నిర్వహణపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 5న ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీఓ ఏ.శ్రీనివాస్, బీసీ సంక్షేమ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ, తదితరులు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 29వరకు జరిగే పోటీలను గురుకులాల ఆర్‌సీఓ బి.రాణి, రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ ప్రారంభించారు. పోటీల్లో జిల్లాలోని 12 గురుకులాల విద్యార్థులు పోటీ పడుతున్నారు. ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు లలిత, ఉర్మిళ, కల్పన పాల్గొన్నారు.

27న అండర్‌-19 క్రీడా జట్ల ఎంపిక పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: అండర్‌-19 బాలబాలికల క్రీడా జట్ల ఎంపికకు ఈ నెల 27న పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం కార్యదర్శి ఎండీ మూసా కలీం తెలిపారు. బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, కరాటే, ఉషూ ఎంపిక పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతాయని వెల్లడించారు. అలాగే, నవంబర్ 5న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, వాలీబాల్ ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని, వివరాలకు 98483 41238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వివిధ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. డిప్లొమా ఇన్ అనస్తీషియాలో 30, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్‌లో 30 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. బైపీసీ విద్యార్థులకు తొలి ప్రాధాన్యత, ఆ తర్వాత ఎంపీసీ విద్యార్థులకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా మెడికల్ కాలేజీలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో కోతుల బీభత్సం


చికిత్స పొందుతున్న విద్యార్థిని

పెనుబల్లి: మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్‌లో బుధవారం కోతులు బీభత్సం సృష్టించాయి. విద్యార్థులు తరగతి గదుల నుంచి మొదటి అంతస్తులోని హాస్టల్‌కు వెళ్తుండగా అక్కడ ఉన్న కోతులు పైకి వచ్చాయి. దీంతో ఆందోళనకు గురైన చరిత, వైష్ణవి మెట్లపై నుంచి కిందకు దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, విద్యార్థినుల వెంట ఏఎన్ఎంను పంపించినప్పటికీ వార్డెన్, అధ్యాపకులు వెళ్లకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు గ్రామ సమీపాన కట్లేరులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన గంతాల వెంకటేశ్వరరావు (30) మృతదేహం బుధవారం లభ్యమైంది. ఆయన మంగళవారం మధ్యాహ్నం గల్లంతు కాగా దాదాపు 20 గంటలకు పైగా ఎస్ఐ పి.వెంకటేశ్ ఆధ్వర్యాన గజ ఈతగాళ్లు కట్లేరులో గాలించారు. ఎట్టకేలకు బనిగండ్లపాడులో కట్లేరు బ్రిడ్జి కింద వెంకటేశ్వరరావు మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

జ్వరంతో బాలిక మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చింతవొర్రె గ్రామానికి చెందిన బాలిక(9) జ్వరంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. చింతవొర్రె గ్రామంలో బాలికపై గతంలో అత్యాచారం జరిగింది. ఈ సంఘటనలో బాధ్యుడైన ఉపాధ్యాయుడికి జీవిత ఖైదు శిక్ష పడిన విషయం అందరికి విదితమే. కాగా బాలిక వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆస్పత్రికి తీసుకెళ్లిన జ్వరం తగ్గకపోవడంతో నిన్న మృతి చెందింది. బాలిక మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, మాజీ జెడ్పీటీసీ మేరెడ్డి వసంత, నాయకులు మేరెడ్డి జనార్దన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.ల్లో)


	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	6,050
మిర్చి	17,000	9.000
మిర్చి తాలు	9,000	6,000
ఏసీ మిర్చి	19,000	10,500
ఏసీ తాలు	8,500	7,000
కొత్త పత్తి	7,100	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043

ఇలా కట్టడి చేద్దాం...


మాక్ డ్రిల్‌లో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఏదైనా హింసాత్మక ఘటనలు, భారీ ఆందోళనలు జరిగిన సమయాన ఆందోళనకారులను అడ్డుకోవడంలో సమయస్ఫూర్తి కీలకమని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఈ మేరకు సివిల్, ఏఆర్ సిబ్బందికి అవగాహన కల్పించేలా ఖమ్మంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో బుధవారం మాబ్ ఆపరేషన్ – మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీ మాట్లాడగా అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, నరేశ్‌కుమార్, ఏసీపీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆందోళనకారులను తొలుత హెచ్చరించడం, ఆ తర్వాత ఉన్నతాధికారుల అనుమతితో బాష్పవాయువు ప్రయోగం.. ఆపై అగ్నిమాపక శాఖ సిబ్బంది సహకారంతో వాటర్ కెనాన్ల ప్రయోగం, అనంతరం లాఠీచార్జీ, ప్లాస్టిక్ పెల్లెట్ల ప్రయోగం అయినా పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. యూనిఫాం ధరించిన కొందరికి ఆందోళనలు అరికట్టడం, లాఠీచార్జ్ చేయడంపై అవగాహన కల్పించగా.. ఇంకోపక్క సాధారణ దుస్తుల్లో ఉన్న సిబ్బంది ఆందోళనకారుల మాదిరి వ్యవహరించారు.


ముందుకు రావొద్దని ఆందోళనకారులకు సూచిస్తూ..


ఆందోళన కట్టడికి సిద్ధమవుతున్న పోలీసు బలగాలు


లాఠీచార్జ్ చేస్తూ..


వాటర్ కెనాన్ ప్రయోగం

ఏఈఓల సామూహిక సెలవు

- హైదరాబాద్‌లో ఆందోళనకు వెళ్లిన ఉద్యోగులు
- నేడు ఏఈఓలతో భేటీ కానున్న డీఏఓ


హైదరాబాద్‌లో నిరసనకు వెళ్తున్న ఏఈఓలు

ఖమ్మంవ్యవసాయం: పనిభారం తగ్గించాలని వ్యవసాయ విస్తర్ణాధికారు (ఏఈఓ)లు బుధవారం సామూహిక సెలవు పెట్టారు. సాధారణ విధులతో పాటు తాజాగా కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే పనులను ఏఈఓలకు అప్పగించింది. దీంతో సర్వే చేసేది లేదని కొన్నాళ్లుగా ఏఈఓలు ఆందోళన చేస్తుండగా రాష్ట్రంలోని పలుచోట్ల 60 మందిని సస్పెండ్‌చేశారు. ఈ నేపథ్యాన సామూహిక సెలవు పెట్టిన వారు హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు బుధవారం వెళ్లారు. డిజిటల్ క్రాప్ సర్వే తమకు భారంగా మారుతుందని, మహిళా ఉద్యోగులు ఒంటరిగా వెళ్లటంలో సమస్యలు వస్తాయని చెబుతున్న వారు పొరుగు రాష్ట్రాల మాదిరి విధులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో జిల్లా ప్రతినిధులు నాగుల్ మీరా, మహేశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పంటల సీజన్‌లో ఇబ్బందే

ప్రస్తుతం పంటలు చేతికందుతుండగా వ్యవసాయ విస్తర్ణాధికారులు మూకుమ్మడి సెలవులు పెడితే రైతులు ఇబ్బంది పడే అవకాశముంది. జిల్లాలో ప్రస్తుతం పత్తి, ధాన్యం విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఈ పంటలను ఏఈఓలు ధ్రువీకరిస్తేనే రైతులు విక్రయించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యాన ఏఈఓల డిమాండ్లపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది. కాగా, జిల్లాలోని ఏఈఓలతో గురువారం సమావేశం కానున్నట్లు డీఏఓ పుల్లయ్య తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్చించి సూచనలు చేస్తామని వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంసహకారనగర్: విధి నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఈఓల జేఏసీ నాయకులు కోరారు. బుధవారం టీఎన్జీవోస్ కోకన్వీనర్ కొణిదన శ్రీనివాస్ తదితరులకు వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. టీఎన్జీవోస్ నాయకులు జయపాల్ విజయ్‌కుమార్, గంగవరపు బాలకృష్ణ, ఏఈఓల నాయకులు బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, కార్తీక్, రమేశ్, ప్రతిభ, ఫాతిమా, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత విధానంలో మంచి దిగుబడి


పత్తి చేనులో శాస్త్రవేత్తలు, రైతులు

రఘునాథపాలెం: అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో చలమల లక్ష్మయ్య సాగు చేసిన పత్తి చేనులో బుధవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, విస్తరణ శాస్త్రవేత్త ఫణిశ్రీ, కోయంబత్తూర్ రీజినల్ సైంటిస్ట్ డాక్టర్ సంపత్‌కుమార్, ఏఓ కె.ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో లాభాలను వివరించడమే కాక పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు.

వన సమారాధనను విజయవంతం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: సకల ఉద్యోగుల జేఏసీ (టీజీఈ జేఏసీ) ఆధ్వర్యాన వచ్చేనెల 3న నిర్వహించనున్న వనసమారాధనను విజయవంతం చేయాలని జేఏసీ బాధ్యులు కోరారు. ఖమ్మం టీఎన్జీవోస్ భవన్‌లో పోస్టర్లను బుధవారం ఆవిష్కరించగా కొణిదన శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాస్, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, దేవరకొండ సైదులు మాట్లాడారు. అన్ని కేడర్ల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొనేలా విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కె.కృష్ణారావు, విజయ్, నాగమల్లేశ్వరరావు, వీరస్వామి, నాగేశ్వరరావు, జి.యాదగిరి, మల్లెల రవీంద్రప్రసాద్, కొమరగిరి దుర్గాప్రసాద్, రమణయాదవ్, ఆంజనేయులు, శ్రీధర్‌సింగ్, బుసా చంద్రశేఖర్, గంగవరపు బాలకృష్ణ, వల్లపు వెంకన్న పాల్గొన్నారు.

చిమ్మపుడి ఆలయంలో చోరీకి విఫలయత్నం

గ్రామస్తులు రావడంతో పారిపోయిన నిందితులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీకి విఫలయత్నం చేశారు. అయితే, అలికిడి విన్న అర్చకుడు ఇచ్చిన సమాచారంతో గ్రామస్తులు చేరుకోవడంతో వారు పారిపోయారు. ఆలయం వద్దకు రెండు ద్విచక్ర వాహనాలపై రాత్రి 10 గంటల సమయాన గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. దేవాలయం సమీపంలోనే నివాసముండే అర్చకుడు మురళీకృష్ణమాచార్యులు ఈ విషయాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా వారు వస్తుండటంతో దుండగులు ఒక బైక్‌ను వదిలేసి పారిపోయారు. మళ్లీ కాసేపటికి వదిలివెళ్లిన బైక్ కోసం రాగా, అప్పటికే వాహనాన్ని గ్రామస్తులు మరోచోటకు తరలించడంతో చేసేదేం లేక సమీపాన సీతారామిరెడ్డికి చెందిన బైక్ చోరీ చేసి వెళ్లిపోయారు. కాగా, గ్రామస్తులు స్వాధీనం చేసుకున్న బైక్ నంబర్ ఆధారంగా పరిశీలిస్తే కామేపల్లి మండలం ముచ్చర్లకు చెందిన జక్కుల రామారావు పేరిట ఉండటం, ఆయన తన వాహనం పోయిందని రెండు నెలల కిందటే ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఘటనపై పూజారి, గ్రామస్తుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.36 వేలు స్వాహా

వైరా: వైరాలోని ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎంకు వచ్చిన వ్యక్తి అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి కార్డు మార్చి నగదు కాజేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కొణిజర్ల మండలం విక్రమ్‌నగర్‌కు చెందిన భూక్యా మదన్ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వచ్చాడు. ఆయనకు అవగాహన లేకపోవడాన్ని గుర్తించిన అక్కడే ఉన్న ఓ వ్యక్తి సాయం చేస్తానని చెప్పి కార్డు తీసుకుని డ్రా చేస్తున్నట్లు నటించి ఆ తర్వాత మరో కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. కాసేపటికి మదన్ బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా రూ.36,900 విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఫోన్‌పే ద్వారా మదన్ తన మిత్రుడికి రూ.10 వేలు బదిలీ చేశాడు. ఆ తర్వాత బ్యాంకుకు వెళ్లి వివరాలు ఆరా తీయగా బోనకల్ ఏటీఎంలో రూ.36,900 డ్రా చేసినట్లు అధికారులు నిర్ధారించారు. కాగా, మదన్ ఖాతా నుంచి నగదు డ్రా చేసిన వ్యక్తే నెల కిందట ముసలిమడుగుకు చెందిన మహిళ కార్డు కూడా మార్చి నగదు కాజేసినట్లు సీసీ పుటేజీ ద్వారా గుర్తించారు. ఘటనపై వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సహచరుల చేయూత


చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన హెడ్‌కానిస్టేబుల్ లోకేశ్ గతనెల 21వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యాన 2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఉమ్మడి జిల్లాలోని సిబ్బంది సేకరించిన రూ.2 లక్షలను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ చేతుల మీదుగా లోకేశ్ కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని అభినందించారు.

బాణాసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

ఖమ్మంక్రైం: రానున్న దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు నిబంధనలు పాటించాలని అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు సూచించారు. దుకాణదారులతో బుధవారం సమావేశమైన వారు మాట్లాడుతూ.. పోలీస్, మున్సిపల్, అగ్నిమాపకశాఖ, విద్యుత్‌శాఖ నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే షాపులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనుమతి లేకుండా బాణాసంచా నిల్వచేసినా, తయారు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, షాపులకు అనుమతి ఇప్పిస్తామని ఎవరైనా డబ్బు వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కీ లేకుండానే విధులు?

ఖమ్మంమయూరిసెంటర్: ఫైళ్లను ఆన్‌లైన్‌లోనే పరిశీలించేలా ప్రభుత్వం అన్ని శాఖల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేస్తోంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా ఈ-ఆఫీస్ విధానంలోనే ఫైళ్లను పరిశీలించి పరిష్కరిస్తున్నారు. ఇందుకోసం విభాగాల హెచ్‌ఓడీలకు డిజిటల్ కీలు అందిస్తారు. కాగా ఇంజనీరింగ్ విభాగంలోని ఓ డీఈఈ విధుల్లో చేరి పది నెలలు కావొస్తున్నా డిజిటల్ కీ తీసుకోకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపు, ఇతర ఫైళ్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ఈ విషయంలో కమిషనర్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ?

నేలకొండపల్లి: వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని నేలకొండపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కోదాడ నుంచి ఖమ్మంకు బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఆపి వివరాలు ఆరా తీశారు. ఆయన పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఏపీలోని అమలాపురానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగగా గుర్తించినట్లు సమాచారం. ఏపీలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ఆయనపై కేసులు ఉన్నట్లు తెలిసింది. అయితే, ఈ విషయమై ఎస్ఐ పి.సంతోష్‌తో మాట్లాడగా వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

విద్యార్థులపై వివక్ష చూపొద్దు..


కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న నాయకులు, విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులపై ప్రభుత్వం చూపిస్తున్న వివక్షను విడనాడి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థులతో ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు వెళ్లి ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తోపులాట జరగగా.. స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6 వేల కోట్లకు పైగా ఉండగా, విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులు నష్టపోకుండా బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు ఎస్కే నాగుల్‌మీరా, మధు, శివనాయక్, మనోజ్, రాకేశ్, ప్రతాప్, గోపి, రోహిత్, సాయి, నరేశ్, అయ్యప్ప, వెంకటేశ్, ఉపేందర్, రవి, గణేశ్ పాల్గొన్నారు.

మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

కొణిజర్ల: మండలంలోని లాలాపురంలోని ఎస్‌పీఆర్ రైస్ ప్రోడక్ట్స్ యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేసి రైతులకు పరిహారం ఇప్పించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మిల్లు ఎదుట బుధవారం ధర్నా నిర్వహించగా సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి కృష్ణ మాట్లాడారు. దాదాపు రూ.81 కోట్ల విలువైన సీఎంఆర్‌ను ప్రభుత్వానికి అప్పగించకుండా యాజమాన్యం పక్కదారి పట్టించిందని.. అంతేకాక రైతుల వద్ద నుంచి బస్తాకు 6 నుంచి 10 కేజీల వరకు తరుగు తీసి రూ.100 కోట్లకు పైగా కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. అయితే, యాజమాన్యం, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు ప్రకటించి నెల దాటినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. దీనికి తోడు ఫ్యాక్టరీ కోసం కొనుగోలు చేసిన భూముల మీదుగా రైతులు వెళ్లకుండా ఆక్రమించి రాజకీయ నాయకులు, మంత్రుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, కుటుంబరావు, పురుషోత్తం, వీరభద్రం, సుధాకర్, నాగేశ్వరరావు, పాసంగులపాటి రవి, చింతనిప్పు ప్రసాద్, కృష్ణారావు, అఫ్జల్, నాగుల్‌మీరా, సత్యనారాయణ, అజయ్, మధు, రామారావు, సతీశ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- 3.3 కిలోల వెండి, రూ.1.50 లక్షలు నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ రఘు


మాట్లాడుతున్న ఏసీపీ అనిశెట్టి రఘు

సత్తుపల్లి/వేంసూరు: దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు వివరాలు వెల్లడించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగ్రంచిప్రోలుకు చెందిన ఎల్లబోయిన గోపి, అద్దంకి గురవయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ అలియాస్ కిట్టుతో పాటు ఒక బాల నేరస్తుడు ముఠాగా ఏర్పడి సుమారు 20 ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. వేంసూరు మండలం వెంకటాపురంలోని అంకమ్మతల్లి ఆలయంలో సెప్టెంబర్ 28న తలుపులు పగులగొట్టి అమ్మవారి నగలు, కిరీటం, వెండి పాత్రలు, బంగారు గొలుసుతోపాటు హుండీలోని రూ.1.50 లక్షలు అపహరించారని, సత్తెమ్మతల్లి గుడిలో దొంగిలించిన బంగారు సూత్రాలను విక్రయించగా వచ్చిన నగదును గోపి ఇంట్లో దాచిపెట్టారని చెప్పారు. మధిర, వత్సవాయి మండలాల్లో కూడా వీరిపై చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు. కిరీటాల్లోని వెండి, బంగారం కరిగించడమే కాక, చోరీలు చేయటానికి రెండు పల్సర్ ద్విచక్రవాహనాలను కూడా చోరీ చేశారని ఏసీపీ తెలిపారు. కాగా, నిందితుల నుంచి 3.3 కిలోల వెండి, రూ.1.50 లక్షల నగదు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

పెనుబల్లి మండలంలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడుతున్న ఎస్కే మౌలాలీని పెనుబల్లి ఎస్ఐ వెంకటేశ్ నేతృత్వాన అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రఘు తెలిపారు. పాత కారాయిగూడెంలో స్కూటీ, తిరువూరులో చోరీ చేసిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, తెలంగాణ నుంచి ఏపీకి మద్యం తరలించిన ఘటనతో పాటు వ్యవసాయ మోటార్ చోరీ కేసులు ఆయనపై ఉన్నాయని చెప్పారు. సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, ఎస్ఐలు వీరప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు. కాగా, కేసుల ఛేదనలో కృషి చేసిన వేంసూరు, పెనుబల్లి ఎస్ఐలు వీరప్రసాద్, వెంకటేశ్, సిబ్బంది రాజమల్లు, సత్యనారాయణను సీపీ సునీల్‌దత్ అభినందించి నగదు రివార్డు ప్రకటించారని ఏసీపీ తెలిపారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు


మృతదేహాల వద్ద అన్నం ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీలో కొద్ది రోజులుగా ఉంటున్న మృతదేహాల కోసం ఎవరూ రాకపోవడంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది, ఔట్‌పోస్ట్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు అన్నం అమరేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఈ ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కూచిపూడి జగదీశ్ తెలిపారు.

ఖమ్మంలో ఏడు ట్రాక్టర్లు..

ఖమ్మంఅర్బన్: ముదిగొండ మండలం చిన్న మండవ వద్ద మున్నేరు నుంచి ఏడు ట్రాక్టర్లలో అక్రమంగా ఖమ్మం తీసుకొచ్చిన ఇసుకను ఖమ్మం అర్బన్ పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఇసుక రవాణాకు అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.